క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కు కుంటున్నకేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అవినాష్ జోషి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు, ప్రభుత్వ విప్ గణబాబు, కేంద్ర ప్రభుత్వ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ కార్యదర్శి అవినాష్ జోషి (ఐఏఎస్) స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికలను ఆలయ డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో తిరుమలేశ్వరరావు అందజేశారు.

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపి అప్పలనాయుడు

పెందుర్తి: చింతల అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సెయింట్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఏఐ సాఫ్ట్‌వేర్‌తో డిజైన్ చేసిన ఐదు కంప్యూటర్లను సమకూర్చింది. ఆయా కంప్యూటర్లతో పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందాలన్న తలంపుతో సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం అని కొనియాడారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సెయింట్ ఫౌండేషన్ సంస్థ ఫౌండర్ బి.వి.ఆర్. రెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొడ్డేటి నూకరాజు, హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

దాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ప్రొడక్షన్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు నేరుగా తమ సంస్థను లేదా 93816 67986, 72079 53919 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అబ్బురపరిచిన కథక్ నృత్యోత్సవం



నృత్యం చేస్తున్న కళాకారులు

మద్దిలపాలెం: సాంస్కృత కథక్ విద్యాలయ వార్షికోత్సవం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరిరామ్మూర్తి, కన్నంనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గురు హరిరామ్మూర్తి మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాలకు జీవం పోస్తున్న సాంస్కృత కథక్ విద్యాలయ కృషి అభినందనీయమన్నారు. విద్యతోపాటు, నృత్యంలో రాణించి మన సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. గురు డాక్టర్ బి.క్రిత కరుణి విశాఖ నగరంలో కథక్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం వారా ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ నగరంలో గత ఏడేళ్లలో 700 మంది కథక్ నృత్యం నేర్చుకునేందుకు క్రిత కరుణి ఎంతో శ్రమించారన్నారు. డాక్టర్ వీపీఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కళలకు ప్రోత్సాహం తక్కువగా ఉందని, ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 27 మంది కళాకారులు 12 నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ అబ్బురపరిచారు.

యూరియా కొరత.. రైతుల వెత

- మండలంలో తీవ్ర డిమాండ్
- ఇప్పటికే పూర్తి కావచ్చిన వరి నాట్లు
- వ్యవసాయ క్షేత్రాల్లో కలుపు తీసేందుకు రైతులు సన్నద్ధం
- అన్నదాతల అవసరం గమనించి అధిక ధరకు అమ్ముకుంటున్న ప్రైవేట్ వ్యాపారులు



సబ్బవరం మన గ్రోమోర్ బ్రాంచ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు (ఫైల్)

సబ్బవరం: ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వరినాట్లు వేసుకోవడం పూర్తి చేశారు. ముందుగా నాట్లు వేసుకున్న రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో కలుపు తీసేందుకు సిద్ధమవుతున్నారు. కలుపు తీసుకునే సమయంలో యూరియా వేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం యూరియాకు కొరత ఏర్పడటంతో డిమాండ్ అధికంగా ఉంది. మండలంలో పలు రైతు సేవా కేంద్రాలు, ఆగ్రో ఏజెన్సీలు ఉన్నప్పటికీ యూరియా దొరకడం లేదు. దీంతో రైతులంతా ఆయా ఏజెన్సీలు, రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆగ్రో ఏజెన్సీలలో పరిమితంగా యూరియా లభ్యం కావడంతో వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు యూరియా తీసుకునే రైతులు మిగిలిన ఎరువులు తీసుకుంటేనే యూరియా విక్రయిస్తున్నారు. రెండు నుండి మూడు బస్తాలు అవసరమైన వారికి సైతం ఒక బస్తా ఇచ్చి పంపుతున్నారు.

యూరియా షాపులపై దాడులు..

యూరియా కొరత అధికంగా ఉండటంతో వ్యవసాయ, రెవెన్యూ, విజిలెన్స్, ఉన్నత స్థాయి అధికారులు మండలంలోని ఆగ్రో ఏజెన్సీలపై విస్తృతంగా దాడులు చేస్తున్నారు. ఆయా ఏజెన్సీలలో ఎరువుల నిల్వలు, రికార్డులు తనిఖీ చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. మోహనరావు ఇతర అధికారులతో కలిసి ఇటీవల సబ్బవరంలోని మన గ్రోమోర్ బ్రాంచ్‌తో పాటు పలు లాగ్రో ఏజెన్సీలను తనిఖీ చేశారు. ఆయా ఏజెన్సీల షాపుల్లోని ఎరువుల నిల్వలు, వాటి రికార్డులు తనిఖీ చేశారు. రైతులకు పలు సూచనలు చేశారు.



నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు (ఫైల్)

కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలి..

వరి నాట్లు వేసుకునేటప్పుడు రైతులు కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో యూరియా శాతం ఉండటంతో మరోసారి యూరియా కలపాల్సిన అవసరం ఉండదన్నారు. వరినాట్లు వేసుకున్న నెల రోజుల తర్వాత కలుపు తీసే సమయంలో యూరియా పరిమితంగా వేసుకోవాలన్నారు. పరిమితికి మించి యూరియా వేసుకోవడం వల్ల తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులు వేసుకోవడం మంచిదని రైతులకు సూచించారు.



కలుపు తీసేందుకు సిద్ధంగా ఉన్న వరి క్షేత్రాలు

యూరియా అధిక వినియోగం తగదు..

ప్రస్తుతం యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వరినాట్లు వేసుకున్న 20 రోజుల తర్వాత కలుపు తీసుకునే సమయంలో యూరియా అవసరం ఉంటుంది. యూరియా ఎకరాకు 15 నుండి 20 కిలోల వరకూ వేసుకోవలసి ఉంటుంది. కాని రైతులు ఎకరాకు 50 నుండి 60 కిలోల వరకూ వినియోగిస్తున్నారు. దీంతో ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్న రైతులు సైతం యూరియా దొరకదు అనే భయంతో ముందుగా తీసుకుని నిల్వ ఉంచుకుంటున్నారు.

వరి విస్తీర్ణం.. యూరియా లభ్యత ఇలా..

మండలంలో వరి సాధారణ సాగు లక్ష్యం	3,395 ఎకరాలు
ప్రస్తుతం వరి నాట్లు పూర్తయిన విస్తీర్ణం	2,550 ఎకరాలు
వరి నాట్లు వేయడానికి మిగిలిన విస్తీర్ణం	845 ఎకరాలు
ఏటా ఖరీఫ్, రబీ సాగుకు వినియోగించే యూరియా	871 టన్నులు
ప్రస్తుతం రైతులకు సరఫరా చేసిన యూరియా	480 టన్నులు

యూరియా దొరకడం లేదు..



1.20 ఎకరాల వరకూ వరి వేసుకున్నాను. వరి నాట్లు వేసుకుని 20 రోజులు అవుతుంది. ప్రస్తుతం కలుపు తీసుకునేందుకు చూస్తున్నాం. యూరియా అవసరం ఉన్నప్పటికీ ప్రస్తుతం యూరియా సరిగ్గా దొరకడం లేదు. గతంలో ఈ పరిస్థితి లేదు. – వదిశల అప్పలరాజు, తెలుకులపాలెం గ్రామం, సబ్బవరం మండలం

పరిస్థితులు చక్కబడతాయి..



మండలంలో వరి నాట్లు పూర్తయ్యాయి. ముందుగా వేసుకున్న రైతులు కలుపు తీసేందుకు సిద్ధమయ్యారు. దీంతో రైతులందరికీ యూరియా అవసరం కావడంతో డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కొంత మేర యూరియా కొరత ఉంది. రెండు మూడు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం మండలం

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం : సింహగిరిపై పారిశుద్ధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం శానిటేషన్ అధికారులను ఈవో వి.త్రినాథరావు ఆదేశించారు. సింహగిరిపై ఏ ప్రదేశంలోనూ అపరిశుభ్ర వాతావరణం కనిపించకూడదని, భక్తుల నుంచి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. సింహగిరిపై శనివారం ఆయన పలు ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులు ఏవిధంగా జరుగుతున్నాయో పరిశీలించారు. ప్లాస్టిక్ రహితంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఉండాలన్నారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టే ప్రదేశాన్ని పరిశీలించి... ఇక్కడ కొబ్బరికాయలు కొట్టేందుకు కొత్త డిజైన్ తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉత్తర రాజగోపురం ఎదురుగా దాతల సహకారంతో నిర్మిస్తున్న షెడ్ పనులను పరిశీలించారు. చందనోత్సవం రోజు కూలిపోయిన రిటైనింగ్‌వాల్ వద్ద మెట్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. విజయదశమికి స్వామి ఆ మార్గంలోనే కొండ దిగువకు వెళ్తారని తెలిపారు.

గణపతి సన్నిధిలో అన్నసమారాధనలు



శృంగారపాడులో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



మొగలిపురంలో గణపతిని దర్శించుకుంటున్న గండి రవికుమార్ తదితరులు

పరవాడ: మండలంలో రావాడ శివారు శృంగారపాడు గ్రామంలో వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ నాయకుడు గండి వంశీ, పరవాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల నడుమ సిద్ధి వినాయకుడి అనుపు మహోత్సవం నిర్వహించారు.

మొగలిపురంలో..

సబ్బవరం: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో స్వామివారి అనుపు మహోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మొగలిపురంలో సూర్యనారాయణ స్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గురి బంగారయ్య, పార్టీ నాయకులు యడ్ల నాయుడు, సింగంపల్లి విశ్వనాథం, గండి ముత్యాలనాయుడు, బత్తిన వెంకట్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం లక్ష్మికి ఘన సత్కారం



పదవీ విరమణ చేసిన లక్ష్మిని సత్కరిస్తున్న ఎంఈవో సువర్ణ

పెందుర్తి: పదవీ విరమణ చేసిన గొల్లవిల్లివానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.లక్ష్మిని శనివారం ఘనంగా సత్కరించారు. పెందుర్తి స్కూల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సువర్ణ చేతుల మీదుగా లక్ష్మికి శాలువా కప్పి జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మేహాద్రిలో నిమజ్జనాలు నిషేధం



మేహాద్రి రిజర్వాయర్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పెందుర్తి : మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో గణపతి విగ్రహాల నిమజ్జనం పూర్తిగా నిషేధించినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం మేహాద్రి రిజర్వాయర్ చుట్టూ నిమజ్జనాల నిషేధంపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసులు, జీవీఎంసీ/గ్రామ పంచాయతీ అధికారులు నిర్దేశించిన చెరువుల్లో మాత్రమే నిమజ్జనాలు చేయాలని కోరారు. ఎవరైనా నిమజ్జనాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణేష్ లడ్డూ @ రూ.8 వేలు



లడ్డూతో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

పరవాడ : మండల పరిధి రావాడ శివారు బొట్టవానిపాలెంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన బందం శ్రీనివాసరావు రూ.8 వేలకు దక్కించుకున్నాడు. లడ్డూ దక్కించుకున్న శ్రీనివాసరావు దంపతులను గణేష్ యూత్, కమిటీ సభ్యులు డప్పు వాయిద్యాలతో సాగనంపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం ఈ సేవ ఘనంగా జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడ వాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



అవగాహన కల్పిస్తున్న వాసవి ప్రతినిధులు

పెందుర్తి: సమాజంలో పోటీ తత్వం పెరిగిపోవడం, ఇతరత్ర అంశాలపై అనేక మంది మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని వాసవీ మహిళా మండలి కమ్యూనిటీ మానసిక ఆరోగ్య కార్యక్రమం ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వై.గోపీచంద్ అన్నారు. పెందుర్తి మండలంలో పలు ప్రాంతాల్లో మానసిక ఒత్తిడి–మానసిక రుగ్మతల నివారణ అంశంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని ప్రతి ఒక్కరూ మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారికి తగిన చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంస్థ ప్రతినిధులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ భాగ్యలక్ష్మి

సబ్బవరం : ఆరోగ్యవంతమైన యువత భారత దేశ నిర్మాణానికి వెన్నుముక అని, ఎటువంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని, చట్టపరమైన శిక్షలకు గురికావాల్సి ఉంటుందని అవగాహన కల్పించారు. అనంతరం అందరినీ చైతన్య పరిచేందుకు విద్యార్థులు ఓ నాటిక ప్రదర్శించారు. ప్రొఫెసర్ రఫాత్ ఖాన్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అఫీసర్ డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ స్టడీ సర్కిల్‌ను బలోపేతం చేయండి

విశాఖ సిటీ: రుషికొండలో ఉన్న ఏపీ స్టడీ సర్కిల్‌ను బలోపేతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, ఏపీ స్టడీ సర్కిల్ ఫోరం ప్రతినిధులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని కోరారు. శనివారం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయా సంఘాల ప్రతినిధులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి సివిల్స్, గ్రూప్ – 1 పోటీ పరీక్షల్లో శిక్షణ కోసం నోటిఫికేషన్ వెంటనే జారీ చేయాలని కోరారు. స్టడీ సర్కిల్‌కు శాశ్వత ప్రాతిపదికన రెగ్యులర్ డైరెక్టర్‌ను, టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ స్టడీ సర్కిల్ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు కొల్లు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఏపీ స్టడీ సర్కిల్ సక్రమ నిర్వహణకు, అభివృద్ధికి అన్ని రంగాలను కలుపుకుని మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు అల్లాడి వీరభద్రరావు, రామకష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీల విజేత చంద్రంపాలెం



బీచ్ కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న వారియర్స్ జట్టు సభ్యులు

విజేతలకు బెంగాల్ వారియర్స్ ట్రోఫీల అందజేత

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. గోపాలపట్నం ఎస్వీఎల్ ఎన్‌జెడ్ హైస్కూల్ జట్లు రన్నరప్ సాధించాయి. విజేతలకు ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ జట్టు సభ్యులు ట్రోఫీలను అందజేశారు. ఆ జట్టు కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్ కుమార్ పాల్గొని.. ఆటను ఎలా మెరుగుపరుచుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పోర్టు స్టేడియంలో ఆదివారం జరిగే తమ మ్యాచ్‌ను వీక్షించేందుకు వారికి ఆహ్వానం పలికారు.

ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష

ఎంవీపీ కాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులతో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 9లోని సంక్షేమ భవన్‌లో గల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఈ సమావేశం నిర్వహించారు. ముందుగా కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన విజయ్ కుమార్‌కు ఈడీ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. అనంతరం సమీక్షలో పాల్గొన్న విజయ్ కుమార్ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న వివిధ రుణాలపై చర్చించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాల అభివృద్ధిపై ఆరా తీశారు. ఎస్సీ అభ్యర్థులకు ఏపీఎస్ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ దరఖాస్తుల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల అమలుకు తీసుకుంటున్న చర్యలు, రికవరీ వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈడీ సత్యపద్మతోపాటు పలువురు కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా న్యాయ సేవాధికార సంస్థ



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

మహారాణిపేట: లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం, ఆర్థిక సాయం, న్యాయ సహాయం, పునరావాస చర్యల కోసం పనిచేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ పలు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, డ్వాక్రా సంఘాల సమన్వయ అధికారి కె.వి.రామలక్ష్మి, ఈవో బి.సురేష్‌కుమార్, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, ఎస్సీ, ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.